
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



చివరి ఆయకటకట!



సాగునీటి కాలువలపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఆధునికీకరణకు కాకపోయినా మరమ్మతులకు నోచుకోకపోవటంతో కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ప్రధానకాలువపై ఉన్న శ్రద్ధ డిస్ట్రిబ్యూటరీ కాలువలపై ప్రభుత్వాలు పెట్టకపోవటంతో అవి కాస్త అధ్వానంగా మారాయి. అరకొర నిధులతో నీటి విడుదలకు ముందు జంగిల్ క్లీనింగ్ వంటి పనులుచేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కాలువలు అస్తవ్యస్తంగా మారిపోయాయి. చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందటం గగనంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులపై దృష్టి సారించి పలు పనులకు నిధులు మంజూరు చేసింది.

- అధ్వానంగా పంట కాలువలు
- శిథిలావస్థలో డిస్ట్రిబ్యూటరీలు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- అత్యవసర మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి

ఎమ్మిగనూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలకు ప్రధాన కాలువపై ఉన్న శ్రద్ధ డిస్ట్రిబ్యూటరీ కాలువలపై లేకపోవడంతో కాలువలు కాస్త అధ్వానంగా మారాయి. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో అనేక ప్రాంతాల్లో పంట కాలువలు శిథిలమయ్యాయి. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందక ఆ పొలాలు బీళ్లుగా మారుతున్నాయి. దీంతో రైతులు వర్షాధార రైతులు వర్షాధార పంటలను సాగుచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఎల్లెల్సీ నీటితో మూడు పంటలు పండించిన రైతులు ఎగువన కర్ణాటక జలచౌర్యం, పంట కాలువలు పాడైపోవటంతో నేడు ఒక పంటను కూడా సాగుచేసుకునే స్థితిలో లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పంటలు అధ్వానంగా మారాయి.

ఆరు మేజరు, 12 మైనర్ డిస్ట్రిబ్యూటరీలు

ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో ఎల్లెల్సీ ప్రధాన కాలువ కింద కౌతాళం, మాధవరం, సూగూరు, గంగవరం, సీకే మేజర్, ఎంఎస్పీ డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. అలాగే 74, 75ఎ, 75బి, 76, 77, 78, 79, 80, 81, 82, 83, 86 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. ఈ కాలువల ద్వారా ఆయా ప్రాంతాల్లోని భూములకు రబీ, ఖరీఫ్‌లో ఎల్లెల్సీ ప్రధాన కాలువ నుంచి సాగునీరు అందాల్సి ఉంది. కర్ణాటకలో జలచౌర్యం వల్ల మనకు రావాల్సిన సాగునీరు రావటం లేదు. పంట కాలువలు మరమ్మతులకు నోచుకోక ఆనవాళ్లు కోల్పోతున్నాయి. కాలువలకు లైనింగ్ లేకపోవటంతో విడుదలైన సాగునీరు కాలువల నుంచి ముందుకు సాగటం లేదు.

ఆనవాళ్లు కోల్పోతున్నాయి..

ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని పంట కాలువలు ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఎమ్మిగనూరు ప్రాంతంలోని డీపీ 79, 80, 81, 82, 86, ఎంఎస్పీ, ఎంఎల్ఎస్పీ కాలువలు అధ్వాన స్తితికి చేరుకున్నాయి. గత ప్రభుత్వాలు కొంతమేర అక్కడ సీసీ లైనింగ్, జంగిల్ క్లీనింగ్ పనులు చేపట్టాయి. అనంతరం పట్టించుకోకపోవటంతో కాలువలో కంపచెట్లు పెరిగి అవి కనిపించటం లేదు. డీపీ 81 కాలువ కుచించుకుపోయి మట్టి కాలువలుగా మారింది. కాలువలకు ఏర్పాటుచేసిన డ్రాప్‌లు కూడా ధ్వంసమయ్యాయి. ఎంఎస్పీ రిజర్వాయర్ నుంచి దిగువకు వెళ్లే కాలువ ఎర్రకోట వరకు బాగానే ఉన్నా దిగువన కాలువకు ఇరువైపుల సీసీ లైనింగ్ దెబ్బతింది. పార్లపల్లి దగ్గర పైప్‌లైన్ వేసినా అదికూడా రంధ్రం పడింది. అక్కడక్కడ ఏర్పాటు చేసిన సిమెంట్ తొట్లు పగిలిపోయి సాగునీరు వృథాగా పోతోంది. కాలువ గట్టు దెబ్బతింది. గతంలో సీసీ లైనింగ్ చేయటంలో నాణ్యత పాటించకపోవటంతో కట్టలు ధ్వంసమయ్యాయి. పొణకల దిన్నె, డీపీ 86, ఎంఎల్ఎస్పీ కాలువలు సీసీ లైనింగ్ లేకుండాపోయింది. నందవరం మండలంలో ముగతి గ్రామం మీదుగా వెళ్లే 6ఎల్, 8ఎల్ కాలువలు మరమ్మతులకు నోచుకోక పోవటంతో ముళ్లకంపలు పెరిగిపోయి దిగువకు నీరు వెళ్లటం కష్టంగా మారింది.

- మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం మండలంలోని రౌడూరు ఆయకట్టు కాలువ, కౌతాళంకు వచ్చే కాలువ, ఉప్పరహాల్ పంట కాలువలకు మరమ్మతులు లేకపోవటం, సాగునీరు రాకపోవటంతో కాలువల ఆనవాళ్లు కనిపించటం లేదు. కోసిగి మండలంలోని దుద్ది గ్రామసమీపంలో ఉన్న ఎల్లెల్సీ పంట కాలువ సీసీ లైనింగ్ ధ్వంసమైంది. పెద్దకడుబూరు మండలంలోని గంగవరం మేజర్ కాలువలో ముళ్లకంపలు ఏపుగా పెరిగాయి. సూగూరు మేజర్ కాలువ సైతం గట్లు దెబ్బతిన్నాయి. మంత్రాలయం మండలం వగరూరు నుంచి సూగూరు, బూదూరు మీదుగా ఉన్న, సింగరాజన హళ్లి, మాలపల్లి మీదుగా ప్రవహించే పంట కాలువలు ధ్వంసమై పూడిక పేరుకుపోయింది.

రూ.2కోట్లు మంజూరు

పంట కాలువల మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. కాలువల మరమ్మతులకు అధికారులు రూ.4కోట్లు ప్రతిపాదనలు పెట్టగా అత్యవసర మరమ్మతుల కోసం రూ.2కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రధాన కాలువ 299 కి.మీ నుంచి 305కి.మీ వరకు పలు పనులు అధికారులు ప్రారంభించారు. వీటిలో కొన్ని పూర్తి కాగా మరి కొన్ని పనులు జరుగుతున్నాయి.

రూ. 4కోట్లకు ప్రతిపాదనలు పంపగా..

ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కాలువల మరమ్మతుల కోసం రూ. 4కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.2కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రధాన కాలువలో కొన్ని చోట్ల జంగిల్ క్లీనింగ్‌తోపాటు డిస్ట్రిబ్యూటరీల దగ్గర సిమెంట్ పనుల చేపట్టాం.

- విద్యాసాగర్, డీఈ, ఎల్లెల్సీ సబ్‌డివిజన్, ఎమ్మిగనూరు



ఆనవాళ్లు కోల్పోతున్న డీపీ 81పంట కాలువ



ఎర్రకోట - పార్లపల్లి మధ్యలో దెబ్బతిన్న సీసీ లైనింగ్

దున్నేశారు..



అన్నదాత కష్టాలు అంతాఇంతా కావు. ఈ ఏడాది ముందస్తు వర్షాలతో రైతన్నల్లో ఆశలు చిగురించాయి. సాగుకు సన్నద్ధం అయ్యారు. వర్షాలు కురవగానే మొక్కజొన్న, కంది, పత్తి పంటలు వేశారు. దాదాపు నెలన్నర రోజుల నుంచి వర్షాలు సరిగా కురవ లేదు. వరుణ దేవుడు ముఖం చాటేశాడు. అన్నదాతలు వర్షం కోసం ఆకాశం వైపు దీనంగా చూడాల్సిన పరిస్థితులు. అడపాదడపా కురిసిన చిన్నపాటి వర్షాలతో లాభం లేకుండా పోయింది. ఓర్వకల్లు మండలంలోని పాలకొలను గ్రామంలో రవిశంకర్ రెడ్డి అనే రైతు 11ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి పెట్టాడు. వర్షం కురవకపోవడంతో పంట వాడుముఖం పట్టింది. ఆదివారం ట్రాక్టర్ సాయంతో పంటను దున్నేశాడు.

- ఓర్వకల్లు, ఆంధ్రజ్యోతి

తీరనున్న సాగు కష్టాలు

- శ్రీశైలం, తుంగభద్రలకు ఉరకలేస్తున్న వరద
- కాలువలకు సాగునీరు విడుదల
- ఇప్పటికే టీబీపీ ఎల్లెల్సీకి 1500 క్యూసెక్కులు విడుదల
- కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేసిన ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు
- రేపు హంద్రీ నీవాకు కృష్ణాజలాల ఎత్తిపోతకు సన్నాహాలు
- కరువు రైతుల్లో ఆనందోత్సవం



కేసీ కెనాల్‌కు పూజలు చేసి నీటిని విడుదల చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు దస్తగిరి, జయసూర్య

కర్నూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరువు సీమ రైతుల్లో సాగు కష్టాలు తీరనున్నాయి. తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలకు వరద పోటెత్తింది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుంది. పంట కాలువల గేట్లు ఎత్తి సాగునీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే తుంగభద్ర డ్యాం నుంచి టీబీపీ ఎల్లెల్సీకి నీటిని వదిలారు. ఆదివారం సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువకు నీటిని విడుదల చేశారు. హంద్రీ నీవా కాలువకు ఈ నెల 15 నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. జలాశయాలు దాటి.. కాలువల్లో చేరిన నీరు ఆయకట్టు వైపు అడుగులు వేస్తున్నాయి. వరినాట్లుతో పాటు వివిధ పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. కరువు రైతుల మోమున సాగు ఆశలు వికసిస్తున్నాయి.

జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రధాన నీటి వనరు తుంగభద్ర ఎల్లెల్సీ కాలువ. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్‌లో 43,515 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో 35వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని నిర్ణయం తీసుకున్నారు. సీమ రైతుల జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతుంది. 1625.32 అడుగుల లెవల్‌లో 77.54 టీఎంసీలు నిల్వ చేశారు. ఎగువ నుంచి 42,844 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతుంది. 35వేల క్యూసెక్కులు నదికి విడుదల చేశారు. అదే క్రమంలో తుంగభద్ర దిగువ కాలువకు 2,500 క్యూసెక్కులు విడుదల చేయగా..

మిగతా 7లో..



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గల్లంతైన యువకుల మృతి 7



తెలుగు భాషను పరిరక్షించుకుందాం 7

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కాలువలోకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్ 7

ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు: కాటసాని

సంగమేశ్వర క్షేత్రానికి నదీజలాల శోభ

- ఎగువ పుష్కర ఘాట్‌ను ముంచెత్తుతున్న వరద
- ఉమామహేశ్వరాలయానికి చేరువలో జలాలు
- సందర్శకుల తాకిడి

ఆత్మకూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర క్షేత్రం నదీజలాలతో శోభను సంతరించుకుంది. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరథి, భవనాసి అనే ఏడు నదులు పవిత్ర సంగమ ప్రదేశంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రం ఇప్పటికే జలాధివాసమైంది. ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నుంచి శ్రీశైల జలాశయానికి భారీగా వరద వస్తోంది. సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్‌ను నదీజలాలు ముంచెత్తుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి శ్రీశైల జలాశయంలోకి ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 73,586 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులకు గానూ 883.30అడుగులకు చేరుకుంది. గరిష్ఠ నీటిసామర్థ్యం 215.807 టీఎంసీలకు గానూ 206.0996 టీఎంసీలు నమోదయ్యాయి. సంగమేశ్వరాలయంలోని ఎగువ పుష్కరఘాట్ మెట్లను నదీజలాలు ముంచెత్తడంతో ప్రస్తుతం చివరి మెట్టు మాత్రమే కనిపిస్తోంది. ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయానికి అతిచేరువకు జలాలు వచ్చి చేరుతున్నాయి. కపిలేశ్వరం నుంచి సంగమేశ్వరానికి చేరుకునే రహదారి పక్కనే వున్న నదీతీరం వరకు జలాలు వచ్చిచేరాయి. దీంతో నదీజలాల సవ్వడులతో తొణికిసలాడుతున్న కృష్ణానది పరవళ్లను వీక్షించేందుకు సందర్శకులు సంగమేశ్వరానికి తరలివస్తున్నారు.





సంగమేశ్వర క్షేత్ర తీరానికి చేరిన వరదజలాలు



ఎగువ పుష్కరఘాట్లను ముంచెత్తుతున్న వరదజలాలు

అహోబిలేశుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఆలయ ప్రధాన అర్చకుడు

ఆళ్లగడ్డ, జూలై 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా అహోబిలం లక్ష్మీనరసింహ స్వామిని ఆదివారం హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ముందుగా అహోబిలం చేరుకున్న కుటుంబ సభ్యులకు జూనియర్ సివిల్ న్యాయాధికారి భాస్కర్, ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలస్వామి, వేదపండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. జడ్జి కుటుంబ సభ్యులు ఎగువ అహోబిలంలో నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లను, దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన అర్చకులు న్యాయమూర్తి కుటుంబ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం అహోబిలం అతిథి గృహానికి చేరుకున్నారు. డీఎస్పీ ప్రమోద్ న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ వరప్రసాద్ ఉన్నారు.

రేపటి నుంచి శ్రీశైలంలో ఉచిత స్పర్శ దర్శనం నిలుపుదల



నంద్యాల ఎడ్యుకేషన్(శ్రీశైలం), జూలై 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికామల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా ఉచిత స్పర్శ దర్శనం రద్దు చేస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల నుంచి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగిన దృష్ట్యా మంగళవారం నుంచి 18వ తేదీ వరకు మధ్యాహ్న వేళలో కల్పించే ఉచిత స్పర్శ దర్శనం నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సర్వ దర్శనం క్యూలైన్‌లలోని భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు తెలిపారు. భక్తులు మార్పును గమనించి సహకరించాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈకార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని వివరించారు.

హిందూ సమాజానికి నిజాలు వెల్లడించాలి

- తిరుమల కొండపై శ్మశానం ఉందన్న విషయం కలకలం రేపుతోంది
- వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్



మాట్లాడుతున్న రావినూతల శశిధర్

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కలియుగ వైకుంఠంగా పిలిచే తిరుమల కొండపై శ్మశానం ఉందన్న విషయం కలకలం రేపుతోందని, ఈ విషయంపై హిందూ సమాజానికి నిజనిజాలు వెల్లడించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. నగరంలోని వీహెచ్‌పీ కార్యాలయంలో ఆదివారం వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ప్రచార, ప్రసార విభాగం మీడియా కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శశిధర్ ఇటీవల రాష్ట్రంలో జరిగిన అనేక విషయాలను ప్రస్తావించారు. తిరుమల కొండపై శ్మశానం విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడు నిజానిజాలు హిందూ సమాజానికి తెలియజేయాలని అన్నారు. ఈ ఏడాది మార్చి 4న రాయచోటి జిల్లాలో వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల ఊరేగింపులో అల్లర్లు, అదే రాయచోటిలో జూలై 1న ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నట్లు అరెస్టు సంచలనం సృష్టించిందని అన్నారు. దేవాలయాలకు చెందిన లక్షలాది ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని వాటిని విచారించాలని కోరారు. జిల్లాలో జోహరాపురానికి చెందిన నీలకంఠేశ్వర స్వామి దేవాలయం 6 ఎకరాలు అన్యాక్రాంతమైనా, ఎన్నోసార్లు వీహెచ్‌పీ నేతలు నిరసనలు తెలిపినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య, కార్యదర్శి పర్రె కోటేశ్వరరావు, మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆయిల్ ట్యాంకర్



కాలువలో పడిన ఆయిల్ ట్యాంకర్

మహానంది, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లె సమీపంలోని తెలుగుగంగ కాలువలోకి ఆయిల్ ట్యాంకర్ దూసుకెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున కర్నూలు నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ అదుపుతప్పి తెలుగుగంగ కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్ చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. లారీ నుంచి ట్యాంకర్ విడిపోయింది.

జేవీవీ స్టేట్ కమిటీలో జిల్లా వాసులకు చోటు

కర్నూలు హాస్పిటల్, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): జన విజ్ఞాన వేదిక(జేవీవీ) 15వ రాష్ట్ర మహాసభ కడప నగరంలో ఆదివారం ముగిశాయి. రెండు రోజులు జరిగిన రాష్ట్ర మహాసభలో జిల్లాకు చెందిన ఐదుగురిని జేవీవీ రాష్ట్ర కమిటీలో ఎంపిక చేశారు. కర్నూలుకు చెందిన బర్మా సురేష్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండగా.. ఈసారి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటుగా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేషాద్రిరెడ్డిని ఎంపిక చేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎస్.మహ్మద్ మియా, రాష్ట్ర శిక్షణ విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ రంగంలో రాష్ట్రానికి రామకృష్ణా రెడ్డిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బి.సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన వారిని కీలక పోస్టులు దక్కడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు.

ఆరేకల్లు ఎంపీటీసీ సభ్యురాలి రాజీనామా

ఆదోని రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆరేకల్లు ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ రాజీనామా చేశారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ అంగన్‌వాడీ సహాయకురాలిగా శ్యామలమ్మ ఉద్యోగం చేస్తుంది. 'ఆంధ్రజ్యోతి' ఈనెల 11న 'ప్రజాప్రతినిధికి అంగన్‌వాడీ పోస్టు' అనే కథనాన్ని ప్రచురించింది. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ఆమెను తొలగించాలని ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నుంచే విధులకు రావడానికి వీల్లేదని సీడీపీవో ఉమామహేశ్వరి నోటీసు ఇవ్వడానికి వెళ్లారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో అంగన్‌వాడీ-2 కేంద్రానికి అతికించారు. కాగా శ్యామలమ్మ ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి ఆ పత్రాన్ని జడ్పీ సీఈవో నాసర్‌రెడ్డికి అందించారు.

ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు

- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పోస్టర్ విడుదల చేస్తున్న వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నాయకులు

కల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం పందిపాడు టీజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో మండల అధ్యక్షుడు వై.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన చేపట్టిన కల్లూరు అర్బన్ 16వార్డులు, రూరల్, మండల నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కాటసాని శివనర సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక పాల్గొన్నారు. ఈసందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ శ్రేణులకు కాటసాని భరోసా ఇచ్చారు. అక్రమ అరెస్టులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అనే క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను కాటసాని రాంభూపాల్‌రెడ్డి విడుదల చేశారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

నంద్యాల టౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ విద్యార్థిని ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈఘటన నంద్యాల పట్టణంలోని నౌమన్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. నౌమన్‌నగర్‌కు చెందిన వేదవతి, రమేశ్‌కు దంపతుల కుమార్తె సౌదామిని(17). నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆలూరు, జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. వివరాల మేరకు.. పొదుపు సంఘంలో రెండో లీడర్‌గా ఉన్న మహిళ బ్యాంకులో డబ్బులు చెల్లించాలని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె సోదరులు అన్నిచోట్ల విచారించినా, ఆచూకీ లభించలేదు. దీంతో ఈనెల 9వ తేదీన ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మహిళ అదృశ్యంపై అదే గ్రామంలో పని చేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తుండటంతో ఆదివారం ఆ ఉద్యోగిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి మహిళ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపారు.

చిన్నబోయిన సున్నం బట్టీలు

- ఒకప్పుడు సున్నపు ఎగుమతులకు ప్రసిద్ధి
- కాలక్రమేణా మూతపడిన సున్నపు బట్టీలు
- ఉపాధి కోల్పోయిన వేలాది కార్మికులు



డోన్ పట్టణ సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న సున్నపు బట్టీలు

డోన్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రాంతం ఒకప్పుడు సున్నం ఎగుమతులకు ప్రసిద్ధి. కాలక్రమేణా సున్నపు ఉత్పత్తుల ఎగుమతులు తగ్గిపోయాయి. సున్నపు బట్టీలు మూతపడ్డాయి. ప్రస్తుతం ఒకటి, రెండు సున్నపు బట్టీలు నడుస్తున్నాయి. డోన్ పట్టణ సమీపంలోని కొట్లవారిపల్లెలో 30 సంవత్సరాల క్రితం సున్నపు బట్టీలు చాలా ఉండేవి. డోన్ ప్యాపిలి మండలాల్లోని ధర్మవరం, కనపకుంట, చింతలపేట, కొచ్చెర్వు, రంగాపురం, వెంకటనాయునిపల్లె, లక్ష్మంపల్లె తదితర గ్రామాల నుంచి లారీల ద్వారా ఉదయం నుంచే సున్నపుబట్టీల దగ్గరికి కార్మికులు చేరుకుని పనులు చేసేవారు. డోన్, ప్యాపిలి మండలాల్లోని పెద్దకొండ, గొల్లపల్ల బుగ్గ, చంద్రపల్లి తదితర ప్రాంతాల్లోని సున్నపు గనుల నుంచి సున్నపు ఖనిజాన్ని లారీలలో డోన్ ప్రాంతంలో ఉన్న బట్టీలకు రవాణా చేసేవారు. సున్నపు ముడి ఖనిజాన్ని బట్టీలలో కాల్చి కర్ణాటక రాష్ట్రంలోని భద్రావతి, కార్‌వాడ్, రాజమండ్రి, బెంగుళూరు, చెన్నై ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారని అప్పటి కార్మికులు పేర్కొంటున్నారు. అప్పట్లో దాదాపు 3వేల మంది కార్మికులు, 40 మంది మేస్త్రీలతో కళకళలాడిన సున్నపు బట్టీలు నేడు వెలవెలబోతున్నాయి. 15 సంవత్సరాల నుంచి బట్టీలు మూతపడుతూ, కార్మికులు ఉపాధి కోల్పోతూ వచ్చారు. నాణ్యమైన ఉత్పత్తుల్లో పోటీ పడలేక ఎగుమతులు తగ్గి బట్టీలు మూతపడుతూ వచ్చాయని సీనియర్ కార్మికుడు రామాంజనేయులు తెలిపారు. నాడు వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన సున్నపు బట్టీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కార్మికులు వ్యవసాయ కూలీలుగా మారారు. కొందరు ఇతర ప్రాంతాలకు వలస పోయారు.



పిచ్చిమొక్కల మధ్య సున్నపు బట్టీ

నడుచుకుంటూ వెళ్లేవాళ్లం



మాది కొచ్చెర్వు గ్రామం. 35 సంవత్సరాల క్రితం సున్నం బట్టీలో పని చేసేందుకు నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. ఒక్కోసారి లారీల ద్వారా కూలీలను తరలించేవారు.

- రామాంజనేయులు, సీనియర్ కార్మికుడు, డోన్

వంద మంది పని చేసేవారు



సున్నపు బట్టీలు నడిచే రోజుల్లో నా కింద వంద మంది కార్మికులు ఉండేవారు. పట్టణంలోని కొండపేట, చిగురుపేట ప్రాంతాల నుంచి కూలీకి సున్నపు బట్టీలకు వచ్చేవాళ్లు. ఇప్పుడు బట్టీలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

- కొండన్న, సీనియర్ మేస్త్రీ

గల్లంతైన యువకుల మృతి

- తుంగభద్ర నదిలో లభ్యమైన ముగ్గురి మృతదేహాలు
- కర్ణాటక నుంచి రాఘవేంద్రుడి దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..
- శోకసంద్రంగా మారిన తుంగా తీరం
- స్వగ్రామాలకు మృతదేహాల తరలింపు



మృతదేహాల వద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మంత్రాలయం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం తుంగభద్ర నదిలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వివరాలివీ.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన డిగ్రీ సెకండియర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులతో పాటు ఓ యువకుడు శనివారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయానికి వచ్చారు. పుణ్యస్నానానికి తుంగభద్ర నదిలోకి దిగారు. వీరిలో ముగ్గురు యువకులు కొడగు జిల్లా గోనిమరూరు గ్రామానికి చెందిన అజిత్ కుమార్(19) హాసన్ జిల్లా కోలగుండ గ్రామానికి సచిన్ జీకే(20), ప్రమోద్ జీఎం(19) గల్లంతయ్యారు. గల్లంతైన ఈ యువకుల కోసం శనివారం గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం కూడా ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం, పోలీసులు, గజ ఈతగాళ్లు, చేపల వేటగాళ్ల పుట్టీలు, స్టీమర్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం 11:30 గంటల సమయంలో యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. అజిత్ కుమార్, సచిన్ జీకే డిగ్రీ చదువుతుండగా.. ప్రమోద్ జీఎం ఓ బేకరిలో పని చేస్తున్నాడు.

ముమ్మరంగా గాలింపు

మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశాల మేరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ మహేంద్ర నాయక్, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో పుట్టీలు, స్టీమర్‌తో ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల నుంచే గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో కిలోన్నర మీటర మేర గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం 11.30 గంటల సమయంలో గల్లంతైన స్థలం కొద్ది దూరంలో ఇద్దరు మృతదేహాలు లభ్యం కాగా, మరొకరి మృతదేహం 150 మీటర్ల దూరంలో లభ్యమైంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, చేపల వేటగాళ్ల, గంగపుత్రులు సంఘం నాయకులు ముగ్గురు మృతదేహాలను ఒడ్డుకు తీసుకొచ్చారు. డీఎస్పీ ఉపేంద్రబాబు, తహసీల్దార్ రమాదేవి, కోసిగి సీఐ మంజునాథ్, గంగాధర్, మాధవరం ఎస్ఐ విజయకుమార్, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, ఎమ్మిగనూరు ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న, ఆర్ఐ జనార్దన్‌రావు, వీఆర్వో భీమన్న గౌడు మృతి చెందిన వారి మృతదేహాలను బంధువులకు చూపించి వారి వివరాలు సేకరించారు. శ్రీమఠం అంబులెన్సులో పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఆ యువకుల తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజ రావు శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్‌ను కోరారు. దీంతో వారు శ్రీమఠం అధికారులతో మాట్లాడి సచిన్, ప్రమోద్ మృతదేహాలను శ్రీమఠం అంబులెన్సు ద్వారా స్వగ్రామానికి తీసుకెళ్లారు. అజిత్‌కుమార్ కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇక్కడికి రాలేదు. దీంతో అక్కడి ప్రజాప్రతినిధులు స్పందించి ఆ యువకుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

శోకసంద్రంలో యువకుల కుటుంబాలు

రెక్కాడితే డొక్కాడని కూలీల కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి తుంగభద్ర నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారన్న విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. సచిన్ తండ్రి కుమార్, ప్రమోద్ తండ్రి మోహన్, అజిత్ తండ్రి రమేష్ కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి పోషించుకుంటున్నారు. పనికి వెళ్తే గానీ రోజు గడవని పరిస్థితి వారిది. తమ పిల్లలను చదివించి మంచి ప్రయోజకులను చేయాలని డిగ్రీ చదివిస్తున్నారు. గల్లంతయ్యారనీ స్నేహితుల ద్వారా తెలుసుకున్న సచిన్ తండ్రి కుమార్, తల్లి అమ్మయ్య, ప్రమోద్ తండ్రి మోహన్, తల్లి మమత ఉండగా.. తండ్రులు, కుటుంబ సభ్యులు మాత్రమే మంత్రాలయానికి వచ్చారు. అజిత్ తండ్రి రమేష్ రావడానికి డబ్బులు లేకపోవడంతో ఇక్కడికి రాలేదు. ఈ ముగ్గురు దీన స్థితిని చూసి, యువకుల మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు, స్నేహితుల రోదనలు చూసి భక్తులు, అధికారులు కంటతడి పెట్టారు. దీంతో తుంగా తీరం అంతా శోకసంద్రంగా మారింది.



గాలింపు చర్యలు చేపట్టాలని సూచనలు చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పుట్టీల ద్వారా గాలిస్తున్న దృశ్యం



మృతదేహాన్నితీసుకువస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ఘనంగా ముగిసిన తెలుగు భాషా పరిరక్షణ సదస్సు



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం పొందిన వివిధ జిల్లాల భాషా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిరక్షించుకుందామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. మాతృభాష తెలుగును అధికార భాషగా, బోధనా భాషగా, ప్రథమ భాషగా గుర్తించాలని కోరుతూ గత రెండు రోజులుగా కొనసాగిన రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ తొలుత చెన్నపురి (చెన్నై) తెలుగు అకాడమీ అధ్యక్షుడు తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు-దిగ్దర్శనం' పుస్తకాన్ని సదస్సు ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువచ్చేలా నిర్వహించే సదస్సులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. వచ్చే ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటూ, తెలుగు మాట్లాడే ప్రాంతాల నుంచి భాషాభిమానులను సమీకరించి పెద్ద ఎత్తున తెలుగు భాషా పరిరక్షణ సదస్సు నిర్వహిద్దామని ఆయన పిలుపునిచ్చారు. సదస్సు నిర్వాహకులకు ఆయన రూ.50 వేలు విరాళం అందజేశారు. మరో అతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా వక్తలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సంజీవరావు మాట్లాడుతూ ప్రముఖ రచయిత తూమాటి దోణప్ప శతజయంతి సందర్భంగా తన పుస్తకాన్ని ఆయనకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. సభాధ్యక్షత వహించిన కేసీ కల్కూర మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో ఆలోచనాత్మకమైన, శాస్త్రీయమైన, సుప్రమాణికమైన తీర్మానాలు చేశామని చెప్పారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రెండు రోజుల భాషా సదస్సుకు కర్నూలు వేదికగా నిలవడం స్ఫూర్తిదాయకమని అన్నారు. పలు అంశాలపై తీర్మానించారు. ఈ సదస్సులో 26 జిల్లాల నుంచి విచ్చేసిన సదస్సు ప్రతినిధులను టీజీ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. పార్వతీదేవి, శ్యామసుందర శాస్త్రి, లక్ష్మయ్య, బాలస్వామి, హైమావతి, సునీత, నీలిమ, సుబ్బలక్ష్మి, అన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగించకూడదు

- సమ్మేళనంలో డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు, అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఉర్దూ వర్సిటీకి అప్పగింకూడదని పూర్వ విద్యార్థులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అంతక ముందు 1997-2000 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 13 ఎకరాల్లో 1991లో ఏర్పాటైన కళాశాలను ఇతర విద్యాసంస్థలకు ఇచ్చేందుకు జరిగే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులను సత్కరించారు.

తీరనున్న సాగు కష్టాలు

5వ పేజీ తరువాయి



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

గుండ్లకేరీ నుంచి 1500 క్యూసెక్కులు వదులుతున్నారు. జిల్లా సరిహద్దుకు కాలువ నీరు చేరుతుండటంతో రైతులు ఆనందంతో మురిసిపోతున్నారు. 18వ తేదీ నుంచి పంట కాలువలకు నీరు విడుదల చేసేందుకు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు.

కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల

సుంకేసుల బ్యారేజీ నుంచి కేసీ కాలువకు ఆదివారం నీటిని విడుదల చేశారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, కేసీసీ సబ్ డివిజన్ డీఈఈ ప్రసాద్‌రావులు ప్రత్యేక పూజలు చేసి కాలువ గేట్లు ఎత్తి 500 క్యూసెక్కులు వదిలారు. క్రమక్రమంగా పెంచి 2,500 క్యూసెక్కులు విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం నంద్యాలలో జరిగిన ఐఏబీ సమావేశంలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో పూర్తి ఆయకట్టు 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని తీర్మానించారు. అందులో భాగంగానే పూర్తి స్థాయికి నీటిని విడుదల చేస్తామని డీఈఈ ప్రసాద్‌రావు తెలిపారు. అయితే తుంగభద్ర గేట్లు మరమ్మతుల దృష్ట్యా ఖరీఫ్‌కు మాత్రమే నీళ్లు ఇస్తామని ఐఏబీలో తీర్మాణించడంతో రబీ సాగు ప్రశ్నార్థకమైంది.

15న హంద్రీనీవాకు కృష్ణాజలాలు

శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, పూర్తి స్థాయి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ఆదివారం 883.30 అడుగుల లెవెల్‌లో 206.09 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. ఎగువ నుంచి 1,28,426 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. జూరాల, సుంకేసుల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో స్పిల్‌వే ద్వారా 27,295 క్యూసెక్కులు, పవర్ హౌస్ ద్వారా 68,330 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు వదులుతున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 20వేల క్యూసెక్కులు సీమ కాలువలకు మళ్లిస్తున్నారు. శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ఈ నెల 15 నుంచి నందికొట్కూరు మండలం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీనీవా కాలువకు కృష్ణాజలాలు ఎత్తిపోసేందుకు ఎస్ఈ పాండురంగయ్య ఆధ్వర్యంలో ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. కెనాల్ విస్తరణ పనులు చేయడంతో ఈ ఏడాది పూర్తి స్థాయిలో 3,850 క్యూసెక్కులు నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అయితే పత్తికొండ కుడి, ఎడమ కాలువలు అసంపూర్తిగా వదిలేయడంతో 65వేల ఎకరాలకు సాగునీరు అందని దైన్య పరిస్థితిగా మారింది.



తుంగభద్ర డ్యాం నుంచి నదికి నీటిని విడుదల చేస్తున్న వరద

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

కార్మికులను ఆదుకోవడంలో విఫలం



మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడం ప్రభుత్వం విఫలమైందని ఆ సంఘం నగర అధ్యక్షుడు కే.సుధాకరప్ప అన్నారు. ఆదివారం కేకే భవన్‌లో కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సభకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పీఎస్ రాధాకృష్ణ, జిల్లా నాయకులు ఖాజాభాషా, టీ.రాముడు, ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించి ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందన్నారు. మేము అధికారంలోకి వస్తే నిలిచిపోయిన సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసి కార్మికుల ఓట్లను కూటమి ప్రభుత్వం కొల్లగొట్టిందన్నారు. అనంతరం 23మందితో నూతన నగర కమిటీని ఎన్నుకున్నారు. ఆర్.నరసింహులు, మాబాషా, కే.సుధాకరప్ప, ఆర్.మద్దిలేటి, వై.శంకర్, ఎంజే ఈశ్వరమ్మ, ఏసు జలాలుద్దీన్, మక్బుల్ బాషా, రెహిమాన్, మునిస్వామి, ప్రభాకర్‌ర రాజు, పురుషోత్తం వహీద్, జి.లక్ష్మన్న, శేఖర్, నరసింహులు, కే.దాసు, కే.జానకిలను ఎన్నుకున్నారు.

గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి కార్యదర్శిగా గోరంట్ల రమణ

కర్నూలు కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు క్రెడాయ్ సంస్థ అధ్యక్షుడు గోరంట్ల రమణ రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం నిర్వహించిన సమితి సమావేశంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణకు బలోపేతమైన కమిటీని ఏర్పాటు చేశారు. కాగా గోరంట్ల రమణ గతంలో జిల్లా ఈత సంఘం అధ్యక్షుడిగా, భవన నిర్మాణదారుల సంఘం క్రెడాయ్‌కి కార్యదర్శిగా వ్యవహరించారు. గోరంట్ల రమణ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గణేశ్ ఉత్సవాలను ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాకినాడలో ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి గోకారి హాజరై మాట్లాడారు. 12వ పీఆర్‌సీ నియామకం, మధ్యంతర భృతి, డీఏలు, సరెండర్ లీవ్, పెండింగ్ బకాయిల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ, పదోన్నతులు పొందిన వారందరినీ వెంటనే రిలీవ్ చేసి వారి స్థానాల్లో విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. 1998, 2008 ఎంటీఎస్ వారికి పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచా లని కోరారు. సమావేశంలో కర్నూలు జిల్లా చెందిన ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీ.నాగరాజు, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

కల్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కల్లూరు మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15 లోపు రైతులు వేరుసెనగ, పత్తి పంటలకు వాతావరణ అధారిత బీమా పథకానికి నమోదు చేసుకోవాలన్నారు. వేరుశనగకు ఎకరానికి రూ.560, పత్తిపంటకు ఎకరానికి రూ.2వేల ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో కామన్ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని, ఈనెల 15తో గడువు ముగుస్తుందని ఏఓ తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కోడుమూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంతి భవనంలో ఆదివారం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాదిగ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్టీయూ మాజీ రాష్ట్ర కార్యదర్శి హెచ్.తిమ్మన్న హాజరయ్యారు. నియోజకవర్గంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు సుధాకర్, జాన్, ఎస్.శ్రీనివాసులు, రజనీకాంతమ్మ, చిన్నఎల్లప్ప, చిన్నహను మం తు, శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, దేవదాసు, విక్టర్, ఆనంద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, మునిస్వామి పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు కల్యాణమ్మ: టీజీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీజీ వెంకటేశ్, కార్యక్రమంలో పాల్గొన్న కేఎన్‌వీ రాజశేఖర్ తదితరులు

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టుదల, క్రమశిక్షణకు మారుపేరుగా మాంటిస్సోరి విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు పి.కల్యాణమ్మ నిలుస్తారని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కొనియాడారు. మాంటిస్సోరి విద్యాసంస్థలు ఏర్పాటు అయి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, అలాగే కల్యాణమ్మ వర్ధంతి సందర్భంగా, ఆదివారం నగర శివారు గుత్తి రోడ్డులోని ఇండస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కల్యాణమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. టీజీ మాట్లాడుతూ విద్యాసంస్థలు ప్రారంభం నుంచి కూడా కల్యాణమ్మ ఎంతో క్రమ శిక్షణతో, ప్రణాళికా బద్ధంగా విద్యాసంస్థలను నిర్వహిస్తూ ముందుకు పోయారని చెప్పారు. మాంటిస్సోరి విద్యాసంస్థల స్వర్ణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని టీజీ ప్రారంభించారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కేఎన్‌వీ రాజశేఖర్, గాయని రాజశేఖర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మాజీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ బాబురాజ్, సురేంద్ర, విద్యార్థి సంఘం నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, రవీంద్ర పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని కొనసాగించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి

కర్నూలు అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల ఐక్యవేదిక కార్యాలయంలో పట్నం రాజేశ్వరి ఆధ్వర్యంలో భాస్కర్, అఖిలకు కులాంతర వివాహం చేశారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట మాట్లాడుతూ వేర్వేరు కులాలకు చెందిన భాస్కర్, అఖిల ఇరువురు కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారన్నారు. ఆ ప్రేమ జంట ఎస్సీఎస్టీబీసీ మైనార్టీ హక్కుల ఐక్యవేదిక సంప్రదించగా, ఇరువురు మేజర్లు కావడంతో ఐక్యవేదిక కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రేమ వివాహం జరిపించామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ విజిలెన్స్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, ఎంబీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శివన్న, పీజీ వెంకటేష్, పార్వతమ్మ, జమీల, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

లైన్‌మెన్ లేరు..!

● సకాలంలో జరగని విద్యుత్ మరమ్మతులు
● పట్టించుకోని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఓర్వకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్‌మెన్ కొరత వేధిస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ తీగలు సరి చేయడం, ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు వేయడం వంటి పనులు చేసే లైన్‌మెన్లు లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్లు, 3,500 బోర్ల కలెక్షన్లు ఉన్నాయి. కన్నమడకల, బ్రాహ్మణపల్లె, హుశేనాపురం, ఉప్పలపాడు గ్రామాల్లో లైన్‌మెన్లు లేరు. నన్నూరులో ఇద్దరు లైన్‌మెన్లను, ఓర్వకల్లులో లైన్‌మన్‌ను నియమించాల్సి ఉంది. రైతులు విద్యుత్ పనులు సకాలంలో జరగక అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఆ గ్రామాలకు లైన్‌మెన్లు లేకపోవడంతో ఇతర గ్రామాల్లో పని చేసే జూనియర్ లైన్‌మెన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా



ఓర్వకల్లు విద్యుత్ సబ్ స్టేషన్

గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు చేయించాలంటే ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఉన్న లైన్‌మెన్లకు రెండు, మూడు గ్రామాలు ఉండటంతో పని చేయలేక పలు అవస్థలు పడుతున్నారు. ఓర్వకల్లు, నన్నూరు, ఉప్పలపాడు, హుశేనాపురం, బ్రాహ్మణపల్లె-2 లైన్‌మెన్లు లేరు. సచివాలయ జూనియర్ లైన్‌మెన్లు కూడా లేరు. ఈ విషయంపై జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో లేని లైన్‌మెన్లను నియమించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

టాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయడం లేదు



పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా, వైర్లు తెగిపోయినా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు కూడా చేయలేకపోతున్నారు. గ్రామంలో లైన్‌మెన్ లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నాం.

●గొల్ల నాగరాజు, రైతు, హుశేనాపురం

సకాలంలో పనులు కావు



విద్యుత్ లైన్‌మెన్లు ఉంటే విద్యుత్ లైన్లు తెగిపోయినా గ్రామంలోకి పొలాలకు విద్యుత్ సరఫరా కాకపోయినా సకాలంలో పని చేయిస్తారు. లైన్‌మెన్ లేకపోవడంతో విద్యుత్ సమస్య లొచ్చినప్పుడు సకాలంలో పనులు కావు. గ్రామానికి ఇద్దరు లైన్‌మెన్లను నియమించాలి.

●ప్రతాప్‌రెడ్డి, రైతు, నన్నూరు

ఓర్వకల్లుకు ఒక్కరే ఉన్నారు



మండల కేంద్రమైన ఓర్వకల్లుకు ఒక్కరే లైన్‌మన్ ఉన్నారు. ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు కానుంది. ఆ లైన్‌మెన్ సెలవుపై వెళితే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నాం. ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తుంది.

●స్వామిరెడ్డి, రైతు, ఓర్వకల్లు

థైరాయిడ్ లోపంతో అవయవ పనితీరు తగ్గుతుంది

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

కర్నూలు హాస్పిటల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): థైరాయిడ్ హార్మోన్ తగినంతగా లేకపోతే దాని ప్రభావం అవయవాల పనితీరుపై పడుతుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విజయవాడ ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలో జోనల్ సీఎంఈని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సీఎంఈకి కర్నూలు, అనంతపురం మెడికల్ కాలేజీలు, శాంతిరాం, విశ్వభారతి మెడికల్ కాలేజీకి చెందిన వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ థైరాయిడ్ లోపిస్తే ఎంతో ప్రమాదకరమని, జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత కుదరక పోవడం, బరువు పెరగడం చర్మం పొడిబారడం, మలబద్ధకం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. హైపో థైరాయిడిజమ్ వల్ల జీవక్రియల వేగం తగ్గుతుందని, కీళ్లు కండరాల నొప్పులకు దారి తీస్తుందని అన్నారు. అనంతరం నలుగురు మెడికల్ కాలేజీ విద్యార్థులు క్విజ్ పోటీలు నిర్వహించగా.. కర్నూలు మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థులు ప్రథమ బహుమతి, శాంతిరాం మెడికల్ కాలేజీ పీజీలు రెండో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, జోనల్ కోఆర్డినేటర్ డా.సాయిసుధీర్, సీఎంఈ అబ్జర్వర్ డా.విశాల, జనరల్ సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ డా.మాధవీ శ్యామల పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో గురువులు

ఓర్వకల్లు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000-2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒక్క చోట కలుసుకుని ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. చదివిన బడి, పరిస రాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. గురువులను సన్మానిం చారు. పూర్వ విద్యార్థులు మనోహర్ నాయుడు, హరికృష్ణ, శివప్రసాద్, కోటేశ్వరరావు, మల్లికార్జున, విష్ణువర్ధన్, భారతి, రాధ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కర్నూలు స్పోర్ట్స్, జూలై 13(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుడిపల్లి సురేందర్ అన్నారు. ఆదివారం ఆయన సి.బెళగల్ మండలంలోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ పాండురంగన్న, స్థానిక ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు కేశవనాథ్, ఎస్ఎంసీ చైర్మన్ గోవిందు ఉన్నారు.

ఇద్దరిపై కేసు

కర్నూలు, అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌పై నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఆదివారం గార్గేయపురంలో బైనేని సురేష్ ఇంటి ముందు మోటార్ బైక్‌పై 40 లీటర్ల సారాను దింపుతుండగా దాడులు చేశామని, బైనేని సురేష్ అదుపులోకి తీసుకోగా, తెలుగు రామదాసు అనే వ్యక్తి పారిపోయాడని, బైక్‌తోపాటు 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ నవీన్‌బాబు, కానిస్టేబుళ్లు ఈరన్న, మధు, సూర్యనారాయణ, ఎం.రాజు, సుదర్శన్‌రాజు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ టీజీని కలిసిన ఎమ్మెల్యే

కర్నూలు, అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నాయకుడు శ్రీరాములు కలిశారు. ఆదివారం నగరంలోని మాజీ ఎంపీ చాంబర్లో నందికొట్కూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు పలచాని మహేశ్వరరెడ్డితోపాటు పలు అంశాలపై చర్చించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, జూలై 13(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జరుగుతుందని నూతన కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరి ష్కా రం లభిస్తుందని సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు Https://meekosam.ap.gov.inలో చూడవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

సంగీత సాధనతో మానసిక వికాసం

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకరశర్మ



జ్యోతిప్రజల్వన చేసి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర శర్మ, సంగీత ప్రదర్శనలు చేసిన చిన్నారులతో అతిథులు

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ సంగీత సాధనతో మానసిక వికాసం సాధ్యమని, మంచి సంగీతం వింటే శిశువులు సైతం పరవశించిపోతారని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శ్రీసిద్ధి వినాయక సంగీత నిలయం వారి వార్షికోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శంకరశర్మ ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. శ్రావ్యమైన సంగీతం వింటుంటే మానసిక స్థితి ఎంతో బాగుంటుందని, అనేక మానసిక ఒత్తిళ్ల నివారణకు మంచి సంగీతం దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటూ సంగీతాన్ని నేర్చుకోవాలన్నారు. సంగీతం నేర్పిచడంలో సిద్ధి వినాయక సంగీత నిలయం గురువులు ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని అన్నారు. సంగీతంలో ఎంతో శక్తి దాగి ఉందని, శిలలనైనా కరిగించే శక్తి సంగీతానికి ఉందని అన్నారు. సంగీతం ద్వారా ఖ్యాతిగాంచిన ఘంటసాల పాటలు వింటే మానసిక రుగ్మతలు తొలగిపోతాయని అన్నారు. విద్యార్థులను సంగీత శిక్షణలపై ప్రోత్సహిస్తున్న తలిదండ్రులను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల విశ్రాంత గురువు సరస్వతమ్మ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య, సంగీత శిక్షకుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా ఫకృద్దీన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఫకృద్దీన్‌తో సభ్యులు

కర్నూలు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం గార్గేయపురం గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా డి.ఫకృద్దీన్ ఆదివారం ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. చైర్మన్‌తోపాటు మరో ఇద్దరు డైరెక్టర్లు బి.జమ్ములయ్య, బి.లక్ష్మీరెడ్డిలతో పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కోటేశ్వర రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన చైర్మన్ ఫకృద్దీన్ మాట్లాడుతూ తనకు పదవి కేటాయించిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.సీతారామిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచు కౌలుట్లయ్య, అజయ్‌కుమార్, రామోజీరావు, మోజెస్, శేఖర్, సురేష్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం విద్యుత్ సౌదా ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టీ.రాముడు, నగర నాయకులు కే.ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో 42వ వార్డు పరిధిలో బాలగంగాధర్ తిలక్ నగర్, చల్లావీధి ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు జే.కిరణ్మయి, రామకృష్ణ, బి.రాము, పురుషోత్తం, వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలం వడ్డెమాన్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.జశ్వంత్ ప్రవేశ పరీక్షలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సీటు సాధించాడు. ఆదివారం విద్యార్థిని పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరప్ప అభినందించారు. అనంతరం జశ్వంత్‌కు ప్రోత్సాహక బహుమతికి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య అందజేశారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా గణపతి ఉత్సవాలు నిర్వహిద్దాం

●మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి
●గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

కర్నూలు కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టు 27 నుంచి ప్రారంభమయ్యే గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణ హితంగా నిర్వహించుకుందామని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం కేసీ కెనాల్ వినాయక మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా జిల్లాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఒక సంప్రదాయంగా వస్తోందన్నారు. ఈఏడాది కూడా ఉత్సవ మంటపాల నిర్వాహకులు మట్టి విగ్రహాలను నెలకొల్పి సంప్రదాయ పద్ధతుల్లో ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, గూడూరు, ఇతర పట్టణాల్లో ఆగస్టు 27 నుంచి ఆగస్టు 31 వరకు ఉత్సవాలు ఐదు రోజులు జరుగుతాయన్నారు. కర్నూలులో ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 9 రోజులు ఉంటాయని తెలిపారు. సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ మాట్లాడుతూ పూర్తి సంప్రదాయబద్ధంగా, హిందువుల ఐక్యతను, సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఉత్సవాల సంఘటన కార్యదర్శి డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి, కార్యాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, కోశాధికారి ఏవీ ప్రసాద్, నగర ఉత్సవ సమితి అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి గిరిరాజ వర్మ, సహ ప్రధాన కార్యదర్శి గుడా సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, నాయకులు తుంగా రమేష్, రాజేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ సంతాపం

కర్నూలు అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి ఎంపీ బస్తిపాటి నాగరాజు సంతాపం తెలిపారు. కోట శ్రీనివాసరావు తన విలక్షణ నటనతో తెలుగు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటన్నారు. కోట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారని పేర్కొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు మండలం ఉలిందకొండలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి సుప రిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ జగన్ విధ్వంస పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమ ర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నిరంగాలను పునఃవ్యవస్థీకరించుకోవాల్సి వచ్చిందన్నారు. చంద్రబాబు తన అను భవంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని వివరించారు. కార్యక్ర మంలో పాణ్యం నియోజకవర్గ పరిశీలకుడు ఆదెన్న, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్‌బేగం, ఉలిందకొండ సహకార సంఘం చైర్మన్ ఈవీ.రమణ, సుబ్బరాయుడు, కరీం, మురళి, నారాయణ, శ్రీకాంత్, వెంకటరమణ పాల్గొన్నారు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు: ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం మండలంలోని పల్దొడ్డి, కొండాపురం గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుపారిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అలాగే కొండాపురం, పల్దొడ్డి గ్రామాలలో సీసీ రోడ్డు, మురుగు కాలువలు, పింఛన్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని మహిళలు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈరన్నగౌడు, భీమన్న, విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, శంకర్‌బాబురెడ్డి, శంకర్, రఘురెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని 9వ వార్డు 185వ బూత్ పరిధిలో వార్డు కౌన్సిలర్ కోడుమూరు షాషావలి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి రామాంజ నేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ కోడుమూరు షాషావలి, సింగిల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేశ్వర్లు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు వీరకుమార్, మాజీ కౌన్సిలర్ చాంద్‌బాషా, సొలేమాన్, రవూఫ్, పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. టీడీపీ చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం భైరెడ్డి కాలనీలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు యాసిన్‌బాషా, అల్లాబాబు, అయూబ్ బాషా, అబ్దుల్లా, నాగరాజు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రేమట గ్రామ టీడీపీ మహిళా నాయకురాలు సుజాత, నీటి సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు మండలం రేమట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుజాత, రాఘవరెడ్డిలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేదలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అనంతరం గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, దానం, క్రిష్టఫర్, సురేష్, వెంకట రాముడు, ఉశేనప్ప, ఎర్రవల్లి రవి, సీతారామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



ఉలిందకొండ: 'సుపరిపాలన తొలిఅడుగు'లో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

రహదారుణాలు



మార్కెట్ యార్డ్ సమీపంలో గుంతలమయంగా రహదారి



వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద రహదారి దుస్థితి..

ఆదోని అగ్రికల్చర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో రహదారులు సరిగాలేకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. నల్ల గేటు నుంచి మార్కెట్ యార్డు మీదుగా వెళ్లే బసాపురం రహదారి గుంతలమయంగా మారింది. నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉందని పాదచారులు అటున్నారు. ఈ రహదారిలోనే మార్కెట్‌యార్డు, పరిశ్రమలకు వాహనాలు వెళుతుంటాయి. అలాగే రైతులు వ్యవసాయ ఉత్పత్తులను వాహనాల్లో ఇదే దారిమీదుగా తరలిస్తారు. ఇటీవల వర్షం కురవడంలో ఆనీరు నిలబడి మోకాళ్లలోతు గుంతలు పడ్డాయి. రాత్రిళ్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, నూతన రహదారి నిర్మించాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

మద్దికెర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఉందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, పురుషోత్తం చౌదరి అన్నారు. ఆదివారం మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. నాయకులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడ్, ఎన్.లక్ష్మీ నారాయణ, గడ్డం రామాంజులు గూడూరు కవిత, చంద్ర, గొడుగు సతీష్ కుమార్, గుడి ఎల్లప్ప, బాషా తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



వినతి పత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

వెల్దుర్తి/టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి క్రిష్ణగిరి మోడల్ స్కూల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఆదివారం మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, కన్వీనర్ బలరాంగౌడు, జ్ఞానేశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రం ఇచ్చారు. బస్సు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందిచిన నాయకులు ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

కనీస వేతనం రూ.30 వేలు ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.30వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, పట్టణ అధ్యక్షుడు తిప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఆధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బీమా పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. మూర్తి, కరెప్ప, మహ్మద్, వీరేష్, భాషా తిమ్మప్ప, లోకేష్, ఈరన్న పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తుగ్గలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మిత్రుడు మృతి చెందడంతో కుటుంబానికి మిత్రులు ఆదివారం రూ.64వేల ఆర్థిక సాయం చేశారు. మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన తలారి రాముడు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1998-99 పత్తికొండ బాలుర హాస్టల్‌లో పదో తరగతి కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు వార్డెన్ రమేష్, సీపీఐ కార్యదర్శి సుల్తాన్, పాటు మరికొందరు విరాళాలు సేకరించి స్నేహితుడి భార్య సావిత్రికి అందించారు. మిత్రులు కౌలుట్ల, రామాంజి, సూర్యప్రకాష్, తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

టీడీపీ నాయకుల దాడి హేయం

● మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి



వెల్దుర్తి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్, వైసీపీ బీసీ మహిళా నాయకురాలు ఉప్పాల హారికపై టీడీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందనడానికి ఇది నిదర్శనమన్నారు. టీడీపీ, జనసేన నాయకులు పోలీసుల సమక్షంలోనే కర్రలు, రాళ్లతో కారుపై దాడిచేసి కారు అద్దాలు పగులకొట్టారన్నారు. మహిళా అని చూడకుండా నోటితో చెప్పలేని అసభ్య పదజాలంతో దూషించారన్నారు. టీడీపీ బీసీల పార్టీ అని చెప్పుకునే చంద్రబాబుకు జిల్లా ప్రథమ పౌరురాలి మీద మహిళ మీద దాడి చేయడం కనబడలేదా అని ప్రశించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలపై రోజురోజుకు దాడులు ఎక్కువయ్యాయని వీటిని ఖండిస్తున్నామన్నారు.

16న మండల సమావేశం

దేవనకొండ, జూలై 13 (ఆంధ్ర జ్యోతి): ఈ నెల 16న మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, ఎంపీపీ, సర్పం చులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొని ప్రజా సమస్యలపై చర్చిచాలని కోరారు.

పంటల బీమా చేయించుకోండి

దేవనకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల బీమా చేయించుకోవాలని ఏవో ఉషారాణి సూచించారు. ఆదివారం మాట్లాడుతూ పత్తి, వేరుశనగ పంటలకు గడువు నేటితో ముగుస్తుందన్నారు. సద్ద, కంది, కొర్ర, ఉల్లి పంటలకు ఈ నెల చివరి వరకు ఉందన్నారు. బీమా ప్రీమియం ఎకరాకు వేరుశనగ రూ.560లు, పత్తి రూ.2వేలు, జొన్న రూ.38, కొర్ర రూ.32, సజ్జ రూ.32లు, కంది రూ.44లు, ఉల్లికి రూ.90ల ప్రకారం ప్రీమియం చెల్లించాలన్నారు. రైతుసేవా కేంద్రాలు, మీసేవా, సీఎస్‌సీ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించాలన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.80ల ప్రకారం అగస్టు 15 లోగా చెల్లించాలన్నారు. బ్యాంకు రుణాలు లేని రైతులు మాత్రమే బీమా చెలించాలన్నారు.

అందుబాటులో ఎరువులు

వెల్దుర్తి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మల్లెపల్లి, బింగిదొడ్డి, వెల్దుర్తి గ్రామాల్లో ఏవో అక్బర్‌బాషా ఆధ్వర్యంలో ఎరువులను పంపిణీ చేశారు. ఏవో మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మల్లెపల్లి, వెల్దుర్తి, బింగిదొడ్డి, లక్ష్మీనగరం, గోవర్ధనగిరి, కలగొట్ల గ్రామాల్లో 300 బస్తాల చొప్పున యూరియా ఉందనా, రైతుసేవా కేంద్రాల నుంచి పొందాలన్నారు.

ప్రజలందరికీ పథకాలు

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



ఎర్రగుడి గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తుగ్గలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ పథకాలు ఇస్తామని, అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం జి.ఎర్రగుడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుదాఘాతంతో మృతి చెందిన రామాంజనేయులు కుటుంబానికి ఆర్థిక సాయం అందలేదని కోరగా, పరిష్కరిస్తామని తెలిపారు. పార్టీ నాయకులు బత్తిన వెంకట్రాముడు, చంద్రశేఖర్ యాదవ్, వెంకటస్వామి, తిరుపాల్ నాయుడు, బాదడ కౌశిక్ కుమార్, మిద్దె వెంకటేశ్ యాదవ్, తిమ్మయ్య చౌదరి, వెంకటయ్య, గోవిందు, ఎల్లప్ప ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు

ఆదోని, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఆదోని టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, పరిశీలకుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇస్వీ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు అమలుచేశారన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే పరిశ్రమలను ఏర్పాటుచేశారని, రాష్ట్రం అభివృద్ధివైపు పయనిస్తోందన్నారు. నాయకులు మారుతినాయుడు, భూపాల్‌చౌదరి, గుడిసె కృష్ణమ్మ, ఉమాపతినాయుడు, రంగస్వామి నాయుడు, మగ్గం బాషా, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌చౌదరి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు

● ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు



హుస్సేన్ (ఫైల్)

గార్లదిన్నె, జూలై 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు సమీపాన 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ షేక్ మహమ్మద్ హుస్సేన్ (45) దుర్మరణం చెందగా.. ఇద్దరు చిరు వ్యాపారులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదోనికే చెందిన ఉమాదేవి, మరియమ్మ మొక్కజొన్న కంకులు తీసుకెళ్లేందుకు ఆటోను బాడుగకు తీసుకుని, శనివారం రాత్రి అనంతపురం వచ్చారు. మార్కెట్‌లో మొక్కజొన్న కంకులు కొనుగోలు చేసి,ఆదివారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు సమీపాన ఆటో టైరు పంక్చర్ కావడంతో మరియమ్మ, ఉమాదేవి ఆటోలోనే కూర్చోగా.. ఖాజామోద్దీన్ రోడ్డు పక్కన లైట్ వయగా, మహమ్మద్ హుస్సేన్ టైరు మార్చుతుండగా, బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్తున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు అతివేగంతో ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అందులో కూర్చున్న మరియమ్మ, ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరియమ్మ, ఉమాదేవిని 108 వాహనంలో అనంతపురం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ గంగాధర్ పరారయ్యాడు. బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న బొజ్జమ్మ

దేవనకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు మిషన్లు ఉపయోగపడతాయని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని జిల్లెలబుడకల, కప్పట్రాళ్ల గ్రామాల్లో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ కుట్టు మిషన్లను పంపిణి చేశారు. రెండు గ్రామాలకు చెందిన వంద మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వాల్మీకులు పోరాటానికి సిద్ధం కావాలి

వెల్దుర్తి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులు పోరాటానికి సిద్ధం కావాలని ఆ సంఘం నాయకులు రామ్‌భీమ్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం వెల్దుర్తి మండలం క్రిష్ణగిరి మండలాల వాల్మీకి నాయకులతో ఆయన టోల్‌గేటు సమీపంలో మంజీరా హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. 30 సంవత్సరాలుగా ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పోరాటాల చేస్తున్నా ఫలితం లేదన్నారు. గతంలో సీఎం చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు.

వసూళ్లకు పాల్పడిన వీవోఏపై విచారణకు ఆదేశం

హొళగుంద, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళల నుంచి అధిక వసూళ్లు చేసిన వీవోఏపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు వెలుగు కోఆర్డినేటర్ రాధ ఆదివారం తెలిపారు. ఈ నెల 13న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వాయిదాల చెల్లింపులో వీవోఏ చేతివాటం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. అదనంగా వసూలు చేసిన రూ.12 వేలను బాధిత పొదుపు సభ్యులకు చెల్లించి నట్లు తెలిపారు. లీడర్లతో సమావేశం నిర్వహించి విచారణ చేస్తామని, అవినీతికి పాల్పడినట్లు తెలితే ఉద్యోగం నుంచి తొలగిస్తామన్నారు.

పత్తికొండ సీపీఐ కార్యదర్శిగా కారుమంచి



పత్తికొండటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల నూతన కార్యదర్శిగా పెద్దహుల్తి గ్రామానికి చెందిన ఉప్పర కారుమంచి, పట్టణ కార్యదర్శిగా రామాంజనేయులును ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. ఆదివారం స్థానిక సి.ఆర్.భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదు మండలాల మహాసభలు ఉత్సాహభరితంగా సాగాయన్నారు. మండల సహాయ కార్యదర్శులుగా దూదేకొండ ఎంపీటీసీ వీరన్నతో పాటు రామాంజనేయులను ఎన్నుకున్నామన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఆలూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): అగ్రహారం సమీపంలో ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. బళ్లారి నుంచి ఆదోని వైపు వెళ్తున్న ఆటో ఆగ్రహారం గ్రామం వద్ద ఆదివారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన మనీష్, కమల్, దిశన్ గాయాలపాలయ్యారు. వీరిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు రెఫర్ చేశారు.

'అన్నదాత సుఖీభవ' జాబితా విడుదల

మద్దికెర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలానికి అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితా విడుదల చేసినట్లు ఏవో రవి ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాల్లో అర్హులైన జాబితాను ఉంచామని, తమ పేర్లు లేని రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. భూ రీసర్వే గ్రామాల్లో ఎల్‌పీ నెంబర్లు వచ్చి వుంటే తమ దృష్టికి తీసుకురా వాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పత్తికొండటౌన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందికోన, కోతిరాళ్ల, దేవనబండ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల పరిధిలో నూతన లైన్ ఏర్పాటు కారణంగా 2 గంటలపాటు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక మూగితాత పంక్షన్‌హాల్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటి కార్యక్రమంలో పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వివిధ పథకాల కింద రూ.2.70లక్షల కోట్లు పంపిణీ చేసిందని, అయితే టీడీపీ సర్కారు సర్దుబాటు పేరుతో రూ.15 వేల కోట్ల విద్యుత్ బిల్లులు వసూలు చేసిందన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల మందికి పింఛన్ తొలగించారని, మంది తల్లులకి 'తల్లికి వందనం' పథకం అమలు కాలేదని మండిపడ్డారు. జడ్పీటీసీ సభ్యులు రామకృష్ణ, రాజారెడ్డి, సిద్ధం హంపిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, దివాకర్‌నాయుడు, నారాయణరెడ్డి, నామాల శ్రీను, కబీర్, బాబు, నర్సప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంతోనే సంక్షేమం



ప్రచారం నిర్వహిస్తున్న వీరభద్రగౌడ్

ఆలూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం ఆలూరు పట్టణంలో 'సుపరిపాలన-తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపు, 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేశారన్నారు. మహిళల కోసం ఆగస్టు 15న ఉచిత బస్సు సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. కన్వీనర్ అశోక్, నాయకులు నరసప్ప, నెట్టెప్ప, ముద్దురంగ, కొమ్ము రామాంజినేయులు, మద్దిలేటి, కొమ్ము రాజు, రాముయాదవ్, గూళ్యం రామాంజినేయులు, మసాల జగన్, జిలానీ, డా.వెంకన్న, ఈరన్న, మల్లేష్ వన్నూరువలి, రమేష్, గుండప్ప, రాజు, ఉలిగప్ప పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే డీలర్లపై చర్యలు

● ఏడీఏ బాలవర్ధిని రాజు, ఏవో సుధాకర్



దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

ఆదోని అగ్రికల్చర్ , జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత సృష్టించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఆదోని ఏడీఏ బాలవర్ధిని రాజు, ఏవో సుధాకర్ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం 'ఎరువుత్తుత్తి' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రైతులకు యూరియా కొరత రాకుండా స్వయంగా వ్యవసాయ అధికారులే ప్రైవేటు ఎరువుల డీలర్లతో పర్మిట్లను రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఏడీఏ బాలవర్ధిని రాజు, ఏవో సుధాకర్ మాట్లాడుతూ ఎరువుల కొరత లేదని రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. డీసీఎంఎస్ కేంద్రంలోనూ, గ్రామ రైతు సేవా కేంద్రాల్లోనూ, రైతు సేవా కేంద్రాల్లోనూ ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రైవేటు డీలర్లు ఎమ్మార్పీకే అమ్మాలని ఇతర సరుకుల లింకు పెట్టవద్దని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పెద్ద హరివాణం, సంతేకూడ్లూరు, ధణాపురం గ్రోమోర్ కేంద్రాల్లో 1,500బస్తాలకు పైగా, డీసీఎంఎస్ కేంద్రంలోనూ ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్ , జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎంకే ఉన్నత పాఠశాల 1995-2000 బ్యాచ్ పూర్వ విద్యా ర్థులు ఆదివారం కలుసుకున్నారు. తమ స్నేహితులను ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తరగతి గదిలో వారు చేసిన అల్లర్లను నెమరు వేసుకున్నారు. నాటి హెచ్‌ఎం ప్రతాప్ సూర్య, రత్నం మాట్లాడు తూ నాడు విద్యార్థులు ఉపాధ్యాయులకు భయడేవారని, నేడు భయపడే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్‌కు బానిసగా మారి చదువుకు దూరమవు తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రతాప్ సూర్యారత్నం మల్లికార్జున, ఎల్లప్ప, ఉమాశంకర్, ఈరలిం గప్ప ఈశ్వరయ్య, సుజాతను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రాఘవేం ద్ర, గోపాల్, శంభనాథ్, అబ్దుల్, అస్లాం, రోజా ప్రియా, శోభ, యశోద, వీణ, స్వప్న పాల్గొన్నారు.

తనిఖీ చేస్తాం

ఆదోని టౌన్ , జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం నుంచి స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను తనిఖీ చేస్తామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.సందీప్ కుమార్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ, పట్టణంలో నాలుగు వందల నుంచి ఐదు వందల వరకు పానీ పూరి, గోబీ మంచూరియా స్టాల్స్ ఉన్నాయని తమ పరిశీలనలో తెలిసిందన్నారు. చైనా సాల్ట్‌తో పాటు కెమికల్స్, రంగులు ఉపయోగించి ఆహారాలు తయారు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఆహారంతో జీర్ణకోశ, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే జరిమానా విధిస్తామని, తిరిగి రెండో సారి కూడా పట్టుబడితే భారీగా జరిమానా విధిస్తామన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

ఆదోని టౌన్ , జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకట చలపతి అన్నారు. ఆదివారం 16వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో చెత్త తరలింపు పనులను స్వయంగా పరిశీలించారు.

వైద్య పరీక్షలు అవసరం

ఆదోని టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : యాభై ఏళ్ళు దాటిన వారంతా తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని బీజేపీ కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ అన్నారు. ఆదివారం విశ్రాంత పెన్షనర్స్ భవన్‌లో రాజ్ పుత్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 2డీ ఎకోతో పాటు ఇతర పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు.

నదీతీరంలో భక్తులకు భద్రత ఏదీ?

● నిరుపయోగంగా మారిన షవర్లు ● ప్రాణాలు కోల్పోతున్న భక్తులు ● స్నానపు ఘాట్ల వద్ద దుస్తులు మార్చుకొనే గదులు లేక మహిళల ఇబ్బందులు ● పట్టించుకోని ఆలయ అధికారులు


యథేచ్ఛగా నదీతీరంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మంత్రాలయం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు చేసే భక్తులకు భద్రత కరువైంది. ప్రమాదకరస్థాయిలో తుంగభద్ర నది ఉగ్రరూపంలో ప్రవహిస్తుండగా.. అవేమి పట్టని భక్తులు యథేచ్ఛగా తుంగభద్ర నదిలో దిగి స్నానాలు ఆచరిస్తున్నారు. తెలిసీ తెలియక కొంత మంది భక్తులు లోతుగా వెళ్లడం, గల్లంతవడం, మృతి చెందడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే అధికారులే లేరు. నది ప్రాంగణాల్లో పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ, శ్రీమఠం సంయుక్త ఆధ్వర్యంలో భక్తులు నదిలోకి దిగకుండా కట్టడి చేసి షవర్ల ద్వారా స్నానాలు చేయించాల్సి ఉండగా.. అవేమీ ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో శనివారం ముగ్గురు కర్నాటక భక్తులు గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందుకు బాధ్యత ఎవరిది అనే దానికన్నా.. భక్తులకు భద్రత కల్పించాల్సింది ఎవరు..? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

మహిళలు దుస్తులు మార్చుకునే వీలు కరువు

రాఘవేంద్రుడిని దర్శించుకోవాలంటే ప్రత్యేక దుస్తులు ధరించాలని నిబంధన ఉంది.. మరి నదీ స్నానం ఆచరించిన మహిళలు వారి దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యాలు కూడా మంత్రాలయ అధికారులు ఏర్పాటు చేయలేదు. చాటుమాటున దుస్తులు మార్చుకోవాల్సిన పరిస్థితి.. ఆదాయంపైన పెట్టే దృష్టి.. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా చూపిస్తే బావుంటుందని పలువురు మాట్లాడుకుంటున్నారు.


షవర్లపై దుస్తులు ఆరబెట్టిన దృశ్యం


అలంకారప్రాయంగా స్నానపు కొళాయిలు

భద్రత కల్పిస్తాం



మంత్రాలయం దర్శనార్థం వచ్చి పుణ్య స్నానాలకు వెళ్లే భక్తులకు మఠం సెక్యూరిటీ, పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు చేపడుతాం. శ్రీమఠం, పంచాయతీ వారితో మాట్లాడి షవర్లు ఏర్పాటు చేసి, నదిలోకి వెళ్లకుండా నోటీసు బోర్డులు ఏర్పాటు చేశాం. భక్తులు పోలీసులకు, శ్రీమఠం సెక్యూరిటీకి సహకరించాలి.

ఉపేంద్రబాబు, డీఎస్పీ, ఎమ్మిగనూరు

షవర్ల ద్వారా స్నానాలు చేయాలి



రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరించే వారికి మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తునే ఉన్నాం. ఆదివారం సాయంత్రం నుంచి నదిలో భక్తులు స్నానాలకు వెళ్లకుండా షవర్ల ద్వారా స్నానాలకు ఏర్పాటుచేశాం. కొంత మంది భక్తులు నిర్లక్ష్యంగా నదిలోకి దిగుతున్నారు, అది మంచి పద్ధతి కాదు, మైకుల ద్వారా హెచ్చరికలు చేసినా పట్టించుకోకుండా వెళ్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు భారీ కేడ్లు, కట్టెలతో స్నానఘట్టాల వద్దకు వెళ్లకుండా భద్రత చర్యలు తీసుకుంటున్నాం.

ఎస్‌కే శ్రీనివాసరావు, మఠం మేనేజర్, మంత్రాలయం

గురుకుల పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయినులు, విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఎమ్మిగనూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి ఏపీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలను ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, భోజనం, మౌలిక సదుపాయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ సామ్రాజ్యంతో సమావేశమై పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలలో తాగునీటి సమస్య, ఆర్వో ప్లాంటు ఏర్పాటుతో పాటు పాఠశాల ఆవరణంలో విద్యుత్ దీపాలు, రోడ్లు వంటి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాలో వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 15, 16, 17వ తేదీల్లో కర్నూలు జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తారు (5.మీ.మీ నుంచి 15మీ.మీ వరకు) వర్షాలు పడే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధ, గురువారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 34డిగ్రీల సెల్సియస్ నుంచి 37డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 24 నుంచి 27 డిగ్రీల సెల్సియస్ ఉంటుందన్నారు. వర్షపడిన వెంటనే యండి, వేడిమితో కూడిన అసౌకర్యమైన వాతావరణం నెలకొంటుందన్నారు. ఉష్ణోగ్రతలు, వర్షాపాతాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో మెలకువలు తీసుకోవాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాల కరపత్రాల పంపిణీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పాలన, కేంద్ర పథకాల గురించి పార్టీ నాయకులు ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేశారు. ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ 32వ వార్డులో తిరిగి ఇంటింటి కరపత్రాల పంపిణీలో వికసిత భారతదేశపు అమృతకాలం సేవ పరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంత్సరాల మోడీ పరిపాలన కేంద్రం అందిస్తున్న పథకాలు అటల్ పెన్షన్ యోజన, ఆయుష్మాన్ భారత్ యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన, ఇందిరాగాంధీ జాతీయ వితంతు పెన్షన్, దీన్ దయాల్ ఉపాధ్యాయ అంత్యోదయ యోజన వంటి పథకాల గురించి బీజేపీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయుడు ప్రసన్నరాజు

ఎమ్మిగనూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో ఆటోప్రమాదంలో గాయపడిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సువర్ణకు ఉపాధ్యాయుడు ప్రసన్నరాజు రూ. 55 వేల ఆర్థికసాయం అందజేశారు. పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన సువర్ణ మాచాని సోమప్ప బాలికోన్నత పాఠశాలలో 9వ తరగది చదువుతోంది. ఈనెల 9న ఆటోలో ఇంటికి వెళ్తుండగా ఆటోప్రమాదానికి గురై సువర్ణకు తీవ్రంగా గాయపడి, కర్నూలులో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు ప్రసన్న రాజు తోటి ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చి బాలిక చికిత్స కోసం కొంత మొత్తాన్ని సేకరించాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సువర్ణను పరామర్శించి బాలిక తల్లిదండ్రులకు రూ. 55వేలను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు.

బహిరంగ ధూమపానం చేస్తే చర్యలు


అవగాహన కల్పిస్తున్న కోసిగి ఎస్‌ఐ హనుమంతరెడ్డి

కోసిగి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో ఎవరైనా బహిరంగంగా ధూమపానం, మద్యపానం చేస్తే చర్యలు తప్పవని కోసిగి ఎస్‌ఐ హనుమంతరెడ్డి అన్నారు. ఆదివారం కోసిగి బస్టాండులో ప్రయాణికులకు, ప్రజలకు సైబర్ క్రైం, రహదారి భద్రతా నియమావళి, బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, బీడీలు, మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపైన కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే పాఠశాలలు, కాలేజీలకు వంద గజాల దూరంలో పొగాకు, ఇతర మత్తు పదార్థాలను విక్రయించకూడదని, బాల్యవివాహాలు, మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాల గురించి, బలవన్మరణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పరిష్కార వేదికను వినియోగించుకోండి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని రైతులు, ప్రజలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగంచేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుచేస్తే నిర్ణీత గడువులోపు సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పడిపోయినా.. పట్టించుకోరా..


విద్యుత్ స్తంభం కూలిపోవటంతో రోడ్డు పక్కన పడేసిన దృశ్యం

ఎమ్మిగనూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానరహదారైన పార్కురోడ్డులో రెండు చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో రహదారిలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఇటీవల కురిసిన గాలి, వానకు పార్కురోడ్డులో బాష్యం స్కూల్ ఎదురుగా రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లో విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఈ స్తంభం కూలిపోయి దాదాపు నెల రోజులు గడుస్తున్న దాని తిరిగి ఏర్పాటు చేయటంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలున్నాయి. అలాగే రెండు రోజుల క్రితం మంత్రాలయం ఎమ్మెల్యే ఇంటి ముందు డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం సైతం విరిగి పడిపోయింది. దాన్ని అలాగే డివైడర్ మధ్యలో వదిలేశారు. భారీగా గాలులు, వర్షాలు వస్తే కిందకు పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంలో పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారుల స్పందించి విద్యుత్ స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


ప్రమాదం జరగకుండా చెట్టు కొమ్మను పెట్టిన స్థానికులు

ఎమ్మిగనూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ప్రధాన రహదారిమధ్యలో ఉన్న యుజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) మ్యాన్‌హోల్ పైకప్పు ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారు లేకపోవటంతో చేసేదిలేక వాహనదారులు ప్రమాదాల భారిన పడకుండా కాలనీవాసులు మ్యాన్‌హోల్ మధ్యలో ఒక చెట్టు కొమ్మను ఉంచారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే మ్యాన్‌హోల్‌కు మరమ్మత్తులు చేపట్టి పై కప్పు ఏర్పాటు చేయల్సిన అవసరం ఎంతైన ఉంది.

విద్యుత్ వైర్ల చోరీ

గోనెగండ్ల, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీ అగ్రహారం గ్రామానికి తాగునీటిని అందించే మూడు బోర్లకు వేసిన విద్యుత్ వైర్లను ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు దొంగలించుకుపోయారు. దీంతో గ్రామానికి తాగునీటి సమస్య ఏర్పడింది. గ్రామానికి తాగునీరు అందించే మూడు బోర్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్ వైర్లు దొంగలించుకుపోవడంతో గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. త్వరతలో కొత్త విద్యుత్ వైర్లు వేసి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణరథంపై విహరించారు. ఆదివారం రాత్రి తదియ శుభదినం ను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రామమ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.

కిక్కిరిసిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం, ఆషాఢ తదియ కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

వైసీపీ మైనార్టీ విభాగం పట్టణాధ్యక్షుడిగా రసూల్

ఎమ్మిగనూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పార్టీ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ముల్లా రసూల్ ఎన్నికయ్యారు సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

పంటలకు బీమా చేసుకోండి

మంత్రాలయం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలకు వాతావరణ ఆధారిత పంటలకు భీమా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జీర గణేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీలోపు పత్తి, వేరుశనగ పంటలకు భీమా చెల్లించాలని కోరారు. పత్తి పంటకు ఎకరాకు రూ.2వేలు, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.560లు భీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

కరెంట్ చార్జీల పెరుగుదలపై నిరసన

ఎమ్మిగనూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు చార్జీల తగ్గించాలంటు కేంద్ర రాష్ట్ర వ్యతిరేక విధానాలకు నిరసన తెలుపుతూ సిపియం నాయకులు గోవిందు,రాముడులు ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో రామన్న, రమేష్, సురేష్, నరసయ్య, వలీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడబూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. నేడు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధివైపు దూసుకె ళ్లుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, ఎంపీటీసీ నరవశిరేఖ, టీడీపీ మండల కన్వీనర్ బసలదోడ్డి ఈరన్న, సోసైటీ చైర్మన్ మీసేవ ఆంజినేయులు, టీడీపీ నాయకులు ఏసేపు, పెద్దయ్య, ఈరన్న, మురళి కృష్ణ, సత్యన్న గౌడ్, శివ, మీసేవ నరసప్ప,రాజు, జనార్దన్, పాల్గొన్నారు.

నందవరం: ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే అది టీడీపీతోనే సాధ్యమని రైస్‌మిల్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని హలహర్వి గ్రామంలో ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఎర్రన్న, జగన్నాథరెడ్డి, దావీదు, ప్రభుదాసు, రాఘప్ప, వెంకట్రాముడు కాల్వ ప్రెసిడెంట్ ఎర్రన్న పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో సోగనూరు గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపుతామని మండల టీడీపీ నాయకులు సోగనూరు రాఘవేంద్ర, జగదీష్ లు అన్నారు. ఆదివారం సోగనూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌస్‌పీరా, సర్వేశ్వర్లు, నాగేంద్ర, దరగయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వ నమోదులో టాప్‌గా నిలవాలి

నందవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదులో నందవరం మండలం టాప్‌గా నిలవాలని జనసేన మండల పార్టీ అధ్యక్షుడు యల్లప్ప కోరారు. ఆదివారం మండల కేంద్రమైన నందవరం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో పేద ప్రజలకు పట్టాల పంపిణీలో కార్యకర్తలు ముందుండి పని చేయాలన్నారు. సమావేశంలో జనసేన గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుల కుటుంబాలను ఆదుకోవాలి

మంత్రాలయం, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చి తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ మృతి చెందిన అజిత్‌కుమార్, సచిన్, ప్రమోద్ కుటుంబాలకు శ్రీమఠం ఆదుకోవాలని జైభీమ్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కిం జానయ్య , జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం రాజు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రత్నం, యోహీను, రాజేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

అవినీతి రహిత పాలన అందించాలి


మాట్లాడుతున్న గురురాజారావు

నందవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకులు అవినీతి రహిత పాలనను అందించాలని దేశాయి యూత్ వ్యవస్థాపకులు గురురాజారావు కోరారు. ఆదివారం నందవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పారదర్శకమైన పాలనను అందించి రాజకీయాలకు అతితంగా పని చేయాలన్నారు. ఆ ఉద్దేశంతోనే యూత్ అషోషియేషన్ తరుపున మండలంలోని అన్ని గ్రామాల్లో యువకులు వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు రావాలన్నారు. సమావేశంలో నందవరం మాజీ సర్పంచ్ రామన్నగౌడు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణలో వంక

● యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న వైనం
● పట్టించుకోని రెవెన్యూఅధికారులు


చంద్రయ్యకొట్టాల సమీపంలో ఆక్రమణకు గురైన వంక

ఎమ్మిగనూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని చంద్రయ్య కొట్టాల ప్రాంతంలో ఉన్న వంక ఆక్రమణలకు గురవుతున్నా అడిగే నాథుడే కరువయ్యారు. ఆక్రమణ దారులు యథేచ్ఛగా స్థలాలను అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 191సర్వే నం బర్‌లో వంక విస్తరించి ఉంది. వంకను ఆనుకొని అటు వైపు ఇటు వైపు వంక పోరంబోకు భూమి ఉంది. భారీ వర్షాలు వచ్చినప్పుడు పెద్దఎత్తున వంకకు వరద వస్తుంది. దీంతో నివాసగృహాలను ఆనుకొని వరద నీరు ప్రవహిస్తాయి. ప్రస్తుతం వర్షాలు అంతంత మాత్రంగానే వస్తుండటంతో వంక పక్కన ఖాళీ భూమి కనిపిస్తుంది. ఆ ప్రాంతంలో పూర్వికుల భూములు ఉన్న ఓ వ్యాపారి వంక పక్కన ఉన్న భూమి తమదేనని యదేశ్చగా అమ్మకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల చంద్రయ్య కొట్టాల ప్రాంతంలో ఉన్న ఆలయం దగ్గర వంకలో ఉన్న రెండు సెంట్ల భూమిని విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఒక సెంటుస్థలాన్ని పక్కనున్న సర్వేనంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. తాజాగా మరో సెంటు భూమిని కూడా విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ అధికారులు సైతం స్థలం ఎక్కడ ఉందో ఏ సర్వే నంబర్‌లో ఉందో ఏ మాత్రం చూడకుండా వంక భూమిని రిజిస్ట్రేషన్ చేయటం పలు అనుమానాలకు తావిస్తోంది. విషయంపై మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డిని వివరణ కోరగా వంకస్థలాన్ని కబ్జాచేసి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు. వంక స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.